సాక్షి జయశంకర్ భూపాలపల్లి

సోమవారం । 27 । నవంబర్ । 2023



బుగులోని జాతర షురూ

కార్తీక పౌర్ణమి సందర్భంగా రేగొండ మండలం లోని తిరుమలగిరి శివారులో ప్రతిఏడాది నిర్వ హించే బుగులోని వేంకటేశ్వరస్వామి జాతర ఆదివారం ప్రారంభమైంది. - 6లో



త్రివేణి గోదావరికి హారతి

కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పంచరత్నాల్లో భాగంగా గోదావరి నదికి పంచహారతి నిర్వ హించారు. - 6లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0° /21.0°

ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా 'జ్వాలతోరణం'



కాళేశ్వరం: కార్తీకమాసం చతుర్దశి, పౌర్ణమి తిథులను పురస్కరించుకొని కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో వైభ వంగా జ్వాల తోరణం కార్యక్రమం నిర్వహిం చారు. ఆదివారం రాత్రి ఆలయంలో ప్రధాన అర్చకులు కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలతో గడ్డితో తోరణం తయా రుచేసి కాగడతో నిప్పంటించారు. మంటలు చెలరేగుతుండగా దాని నుంచి భక్తులు వీగి మొక్కుతూ వెళ్లి భక్తిపారవశ్యంలో మునిగారు. అనంతరం అర్చకులు భక్తులను ఆశీర్వదిం చారు. ఈ కార్యక్రమంలో ఈఓ మహేష్, ధర్మ కర్తలు సమ్మయ్య, శ్యాంసుందర్ దేవుడా, రాం రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర సాయుధ పోలీసు బలగాల కవాతు



భూపాలపల్లి రూరల్: ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు సిబ్బందికి సహాయంగా కేంద్ర సాయుధ పోలీసు బలగాలు వచ్చేశాయి. కేం ద్రసాయుధ పోలీసు బలగాలతో ఆదివారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాసింప ల్లి, గుడాడ్‌పల్లి గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్ (క వాతు) నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాంనర్సింహారెడ్డి మాట్లాడారు. ఎన్నికల సంద ర్భంగా శాంతి భద్రతల సమస్యలు రాకుండా ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా పాత నేర స్తులను బైండోవర్ చేస్తున్నామన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియో గించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యం లో ఓటే ఆయుధమని ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో ఎస్సైలు శ్రావణ్‌కుమార్, సివిల్ పోలీస్ సిబ్బంది పాల్గొ న్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



కాటారం: కాటారం మండలం గంగారం, దామెరకుంట గ్రామాల్లో ఆదివారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిం చారు. పుర విధుల గుండా కవాతు చేస్తూ శాం తి భద్రతల పరిరక్షణ కోసం తాము ఉన్నామని తెలిపేలా ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ఘటనలు చోటుచేసు కోకుండా తాము అండగా ఉంటామని ధైర్యం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ రంజిత్‌రావు, ఎస్సైలు అభినవ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం: జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గాష్‌ఆలం సూచించారు. ములుగు జిల్లా కేం ద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ దం డకారణ్యం నుంచి అసెంబ్లీ ఎన్నికలకు భంగం కలిగించాలనే లక్ష్యంతో జిల్లాలోకి మావోయిస్టు యాక్షన్ టీం వచ్చిందన్నారు. వారు కనిపిస్తే పోలీసులకు సమాచారం అం దించి ఆ సభ్యులను పట్టించాలని కోరారు. మండల కేంద్రాల్లో మావోయిస్టు యాక్షన్ టీం వివరాలు, ఫొటోలతో విడుదల చేశామన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) రాబోయే అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరించాలని ప్రకటన విడుదల చేసిందని అలాంటి వాటిని ప్రజలు పట్టించుకోవద్దన్నారు. ప్రజలు నిర్భ యంగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని అందుకు పూర్తి బందోబస్తును పోలీస్ శాఖ ఏర్పాటు చేసిందని వెల్లడించారు. మావోయిస్టు పార్టీ తమ వ్యూహాలను అమలు చేయడానికి, కుంజం ఇడుమల్ అలియాస్ మహేందర్, కొవ్వాసి గంగ అలియాస్ మహే ష్, ముస్సకి దేవల్ అలియాస్ కరుణాకర్, వెట్టి దేవ అలియాస్ బాలు, పొట్టం అడుమ అలియాస్ సంజు అలియాస్ సంజీవ్, వెట్టి లక్ష్మ అలియాస్ కల్లులతో ప్రత్యేక యాక్షన్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిసిందన్నారు. ఇటీవల ఈ టీమ్ తెలంగాణ సరిహద్దులను దాటి ములుగు ఏరియాలోకి ప్రవేశించిందని వివరించారు. మావోయిస్టులు ఎవరైనా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

రహస్య స్నేహితులు!

'కోవర్టు'ల కలకలం..

- అన్ని పార్టీల అభ్యర్థుల్లో గుబులు
- ప్రత్యర్థుల వ్యూహాలపై నజర్
- ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై పరస్పర ఫిర్యాదులు..
- పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి
- పార్టీ ఫండ్, డబ్బుల పంపిణీపై అసంతృప్తిలో కార్యకర్తలు



సాక్షిప్రతినిధి, వరంగల్: సార్వత్రిక ఎన్నికల పోలిం గ్‌కు సరిగ్గా మరో మూడు రోజులే ఉంది. సమయం దగ్గర పడుతున్నా కొద్దీ ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయ రం గులు మారుతున్నాయి. ఉదయానికున్న సమీకర ణాలు.. సాయంత్రానికి తలకిందులవుతున్నాయి. పరిణామాలను తమకు అనుకూలంగా మార్చు కోవడానికి నేతలు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రత్యర్థి వ్యూహాలను పసి గట్టడం, ప్రచారాలు, కార్యక్రమాలపై నిఘా పెట్టడం.. ఉల్లంఘనలుంటే వాటిపై అధికారులకు ఫిర్యాదు చేయడం వంటివి ముమ్మరంగా సాగుతు న్నాయి. వీటితోపాటు ప్రత్యర్థి పార్టీలో కొందరిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వారు చేసిన తప్పులను వీరికి తెలియజేసే పనిని వారికి అప్పజెబుతున్నారు. ఇందుకోసం రూ.లక్షలు ఖర్చు పెట్టడానికైనా సిద్ధమవుతున్నారు. ఇప్పుడు ఫలానా పార్టీ అనే తేడా లేకుండా అన్నింటిలోనూ ఇలాంటి పోకడలు కనిపిస్తున్నాయి. సోమవారం నుంచి ఇవి మరింత తీవ్రరూపం దాల్చనున్నాయి.

కోవర్టుల కలకలం..

ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడనే నానుడి ఉన్నదే. కొంతమంది నాయకుడి వెన్నంటే ఉండి.. నమ్మకంగా నటించి ఇక్కడి విషయాలను ప్రత్యర్థు లకు చేరవేస్తున్నారు. సంపాదనే పరమావధిగా ఈ పని చేస్తున్నారు. నాయకులు తనవెనుక ఉండే వారిలో ఇలాంటి వారు ఉన్నారని తెలిసినా వారెవ రో గుర్తించలేకపోతున్నారు. ప్రత్యర్థుల చెంత నమ్మ కంగా పని చేస్తున్నవారిని నాయకులు బుట్టలోకి లాగుతున్నారు. వారి ద్వారా అక్కడ జరిగే విషయా లను తెలుసుకుంటూ ఎదుటివారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నేతల వివరాలు, సభలు, సమావే శాల్లో జరిగే ఉల్లంఘనలు, ఎన్నికల్లో ధన, మద్య ప్రలోభాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి వివ రాలు తెలుసుకునేందుకు ఈ కోవర్టులు ఉపయోగ పడుతున్నారు. మరికొన్ని చోట్ల ఒక్కడుగు ముందే సిన కోవర్టులు.. ఓ పార్టీకి చెందిన అభ్యర్థి ఇచ్చిన డబ్బులు పంచుతూ మరో పార్టీ అభ్యర్థికి ఓటేయ మని చెబుతున్నారన్న చర్చ ఉంది. ఇందుకోసం ప్రత్యర్థులు భారీగానే ముట్టచెబుతున్నారని సమాచారం.

ఏం చేశారు.. ఎవరికి పంచారు?

బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఆయా పార్టీల అధిష్టానం పంపిన పార్టీ ఫండ్‌పై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో రచ్చ జరు గుతోంది. 'ఎవరికి ఇచ్చారు.. ఎక్కడ పంచారు?' అంటూ బహిరంగంగానే నిలదీతల ఘటనలు వెలుగుచూస్తున్నాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థులకు రూ.10 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు అందినట్లు ఆపార్టీ ముఖ్యనేతలే చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు రెండు విడతల్లో ఐదు రోజుల తేడాతో రూ.10 కోట్ల నుంచి రూ.15కోట్ల వరకు అందినట్లు ఆ పార్టీవర్గాల్లో జరుగుతున్న చర్చ. అలాగే బీజేపీ అధిష్టానం అభ్యర్థులను బట్టి రూ.50 లక్షల నుంచి రూ.3కోట్ల వరకు అందించినట్లు ఆ పార్టీవర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. అర్బన్ స్థానాల్లో పోటీ చేస్తున్న కొందరికి అంతకుమించే అందించినట్లు ప్రచారం. అయితే పార్టీ కార్యకర్తలు, ఓటర్ల కోసం పంపిణీ చేయాల్సి ఉండగా.. చాలా చోట్ల వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమను పట్టించు కోవడం లేదంటూ కేడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తోం ది. కొన్నిచోట్ల డబ్బుల వ్యవహారంలో అభ్యర్థుల కుటుంబాల్లో ముదిరిన ఆధిపత్యం ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థాయికి చేరింది. ఓవైపు అన్ని పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పడరాని పాట్లు పడుతుంటే... మరోవైపు కోవర్టులు, పార్టీఫండ్, డబ్బుల పంపిణీ వివాదాలతో తలలు పట్టుకుం టున్నారు.

కోవర్టులకు భారీ నజరానాలు

రహస్య స్నేహితులు(కోవర్టులు) అందించిన స మాచారాన్ని బట్టి వారికి నజరానాలు అందించేం దుకు అన్ని పార్టీల ముఖ్యనేతలు, అభ్యర్థులు సిద్ధ మయ్యారు. ప్రతిఫలాన్ని ఆశిస్తున్నారు. ఎన్నికల సంఘం విధించిన వ్యయ పరిమితి, ప్రచార సమ యంలో అభ్యర్థి వెంట తప్పనిసరిగా వీడియో బృ ందం ఉంటోంది. వీటి బారి నుంచి తప్పించుకు నేందుకు అభ్యర్థులంతా రహస్య పద్ధతులు అవ లంబిస్తున్నారు. ఎన్నికల నిబంధనల్లో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని వివిధ వర్గాలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమయా ల్లో జరిగిన ఉల్లంఘనలకు సంబంధించిన ఆధా రాలతో సహా ప్రత్యర్థులకు చేరవేస్తే అందుకు తగ్గ ట్లుగా ప్రతిఫలం అందజేస్తున్నారు. కోవర్టుల స మాచారంతోనే ఎన్నికల సంఘాల వరకు ఫిర్యా దులు వెళ్తున్నాయి. భూపాలపల్లి, మహబూ బాబాద్, ములుగు, జనగామ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట తదితర నియోజకవర్గాల్లో ఈ తరహా ఫిర్యాదులందాయి. పలుచోట్ల డబ్బులు తరలి స్తున్న వాహనాలు కూడా పోలీసులకు చిక్కాయి.

అభిషేకాలు..దీపారాధనలు



ఉసిరి చెట్టు వద్ద లక్షవత్తులు వెలిగిస్తున్న భక్తులు

- భక్తులతో కిక్కిరిసిన కాళేశ్వరాలయం
- 30వేల మంది దర్శనం
- రూ.3.2లక్షల ఆదాయం



గర్భగుడిలో పూజలు చేస్తున్న భక్తులు



ఉసిరి చెట్టు వద్ద దీపారాధన చేస్తున్న మహిళలు

కాళేశ్వరం: కార్తీకమాసం నేపథ్యంలో కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెలంగాణ, ఆంధ్రప్ర దేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. గోదావరి మాతకు ఇసుకతో సైకిత లింగాలు చేసి పూజలు చేశారు. అనంతరం ఆలయంలో స్వామివారి గర్భ గుడిలో అభిషేకాది అర్చన పూజలు నిర్వహించారు. మహిళలు శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయం లో కుంకుమార్చనలు చేశారు. ఉసిరి చెట్టు వద్ద ప్రదక్షిణలు చేసి లక్షవత్తులు వెలిగించారు, లక్షము గ్గులు వేశారు. ఉసిరిపై దీపం వెలిగించి దీపారాధన లు చేశారు. ఉసిరి చెట్టు వద్ద మహిళలతో పూజలు చేశారు. కాలసర్ప నివారణ, శనిపూజలు, సత్య నారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. దీంతో ఆలయంతో పాటు గోదావరి తీరంలో భక్తులతో ఆధ్యాత్మికత వాతావరణం నెలకొంది. సుమారు 30వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకు న్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం ఒక్క రోజు వివిధ పూజలు, లడ్డు ప్రసాదాల ద్వారా రూ.3.2లక్షల ఆదాయం సమకూరింది.

రాజ్యాంగం ఆత్మ లాంటిది

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రారావు



మాట్లాడుతున్న జడ్జి రామచంద్రారావు

భూపాలపల్లి అర్బన్: స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అనే విలువల మీద భారత రాజ్యాంగం ఏర్పాటైందని, భారత రాజ్యాంగం మానవులకు ఆత్మ లాంటిదని జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రారావు అన్నారు. భారత రాజ్యాంగ, జాతీయ చట్ట దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం న్యాయ అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి రామచం ద్రారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మంచిగా చదువుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. మహనీయులు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముం దుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏదులాపురం శ్రీనివాస్, పోక్సో కోర్టు పీపీ విష్ణువర్ధన్‌రావు, అసిస్టెంట్ గవ ర్నమెంట్ ప్లీడర్ రేగుల రాకేష్, న్యాయవాది వెం కట్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విల్లు ఎక్కుపెట్టిన కేంద్రహోం మంత్రి అమిత్‌షా, సభకు హాజరైన జనం

బిల్ట్‌ను తెరిపిస్తాం..

బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే ట్రైబల్ యూనివర్సిటీ పక్కకే..

- మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తిస్తాం
- పార్టీ అభ్యర్థి డాక్టర్ అజ్మీరా ప్రహ్లాద్‌ను గెలిపించాలి
- ఎన్నికల ప్రచార సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా



మాట్లాడుతున్న అమిత్‌షా, పక్కన అభ్యర్థి ప్రహ్లాద్

అమిత్ షా పర్యటన సాగిందిలా..

- 2.25గంటలకు సభాస్థలికి చేరుకుని అభివాదం చేశారు.
- 2.34గంటలకు ప్రసంగాన్ని ప్రారంభిం చారు.
- 2.56 గంటలకు ప్రసంగం ముగిసింది.
- అనంతరం గ్యాలరీలో ప్రజలకు అభివాదం చేశారు.
- 3.00గంటలకు బయల్దేరి వెళ్లారు.

ములుగు /ములుగు రూరల్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే కమలాపురం రేయాన్స్ బిల్ట్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగం గా ఆదివారం ములుగు నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ అజ్మీరా ప్రహ్లాద్ గెలుపు కోరుతూ.. ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన సకల జనుల విజయోత్సవ సంకల్ప సభకు అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే ట్రైబల్ యూనివ ర్సిటీకి భూమి ఇవ్వదని, పక్కన పెట్టేస్తుందన్నారు. ములుగు ప్రజలపై ప్రేమతో ప్రధానమంత్రి మోదీ సమ్మక్క–సారలమ్మ పేరుతో ట్రైబల్ యూనివ ర్సిటీకి ఆమోదం తెలిపి రూ.900 కోట్లు కేటాయిం చారని తెలిపారు. బీజేపీ అభ్యర్థిని ఆశీర్వదించి గెలిపిస్తే ట్రైబల్ యూనివర్సిటీని త్వరితగతిన పూర్తి చేసి భూమి ఇవ్వడంతో పాటు మరో రూ.300 కోట్లు మంజూరు చేస్తామన్నారు. గిరిజనుల అటవీ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకు రావడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలబాలికలు చదువుకోవడానికి పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు అందిస్తే సీఎం కేసీఆర్ వాటిని అమలు చేయడం లేదన్నారు. శాసనసభల్లో దేశవ్యాప్తంగా అత్యధికంగా గిరిజనులు ఉన్నారని, వారితోపాటు పనిచేసే అవకాశాన్ని తెలంగాణలో ప్రహ్లాద్‌కు ఇవ్వాలని ప్రజలను కోరారు. గిరిజన విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా 7,480 ఏకలవ్య పాఠశాలలను ప్రారంభించామని తెలిపారు. అధికా రంలోకి రాగానే సెప్టెంబర్ 17న అధికారికంగా హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తా మన్నారు. వందేమాతరం, భారత్ మాతాకీ జై అం టూ అమిత్ షా సభకు హాజరైన ప్రజలను ఉత్తేజప ర్చారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్, తన సోదరి పద్మ లంబాడా సంప్రదాయ గుంగ్‌టోతో ఆయనను సన్మానించారు. అనంతరం రామబాణం అందించ గా అమిత్ షా ప్రజల వైపు ఎక్కుపెట్టి చూపించారు.

బీజేపీని గ్రామాల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా ప్రహ్లాద్



బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను సభకు వచ్చిన ప్రజలు గ్రామ గ్రామానికి తీసుకెళ్లాలని అమిత్ షా చేసిన ప్రసంగం ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా ప్రహ్లాద్ అన్నారు. నియోజకవర్గంలో తన తండ్రి దివంగత అజ్మీరా చందూలాల్ చేపట్టిన అభి వృద్ధి మాత్రమే కనిపిస్తోందన్నారు. ఎక్కడైతే అభివృద్ధి పనులు ఆగిపోయాయో వాటిని పూర్తి చేసి చూపిస్తానని, తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మా రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా కృష్ణవేణి నాయక్, స్వరూపారాణి, సురేశ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నేడు ఓరుగల్లుకు ముఖ్యనేతలు

సాక్షి, మహబూబాబాద్: మరో మూడు రోజుల్లో ఎన్నికల పోలింగ్ జరగనుండడంతో అన్ని పార్టీలు ప్రచారం హోరెత్తిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో సోమవారం ముగ్గురు ముఖ్య నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొన నున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ అభ్యర్థి హుస్సేన్‌నాయక్ మద్దతుగా ప్రధాని మోదీ పర్యటన, మరిపెడలో కాంగె స్ డోర్నకల్ అభ్యర్థి జాటోత్ రాంచంద్రు నాయక్ ఆధ్వర్యంలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సభ జరగనుంది. ములుగు జిల్లా ఏటూరు నాగారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యో తికి మద్దతుగా మంత్రి కేటీఆర్ రోడ్‌షోలో పాల్గొననున్నారు. ఈ మేరకు ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు భారీగా జనసమీకరణ చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రత

ఎస్పీ కిరణ్ ఖరే



భూపాలపల్లి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్ట్ ప్రభావిత, సమ స్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కిరణ్ ఖరే ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుం డా, స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎన్నికల నిర్వ హణకు జిల్లా పోలీసులతో పాటు, దాదాపు 1000 మంది కేంద్ర సాయుధ బలగాలు జిల్లాకేంద్రానికి చేరుకున్నాయన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసుల సేవలను ఎన్నికల్లో వినియోగిస్తున్నామని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లాలోని ప్రతి ప్రాంతాన్ని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా మావోయిస్టులు జిల్లాలోకి ప్రవేశించకుండా గోదావరి పరివాహక ప్రాంతంతో పాటు, ఫెర్రీ పాయింట్ల వద్ద గట్టి భద్రతా చర్యలు చేపట్టామ న్నారు. ఎన్నికల నిర్వహణను ఎవరైనా అడ్డుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

ఓటు హక్కు వినియోగించుకున్న 696మంది

- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్
- ఓటరు జాబితాలో తప్పులు..
- ఎన్నికల అధికారులతో సిబ్బంది వాగ్వాదం



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్



ఓటరు జాబితా వివరాలు తెలుపుతున్న సిబ్బంది

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగిం చుకునేందుకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలిం గ్ కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ భవేష్‌మిశ్రా పరిశీలించారు. ఎన్నికల విధులలో ఉన్న సిబ్బందికి పలు సూచన లు చేశారు. మొదటిరోజు 696మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకు న్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్‌మిశ్రా మీడి యాతో మాట్లాడుతూ.. భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా సాధారణ అసెంబ్లీ ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా జిల్లాకేంద్రం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 7 బూత్‌లు, పోలీస్ సిబ్బంది కోసం పాత జిల్లా పోలీస్ కార్యాలయంలో ఒక పోస్టల్ బ్యాలెట్ బూత్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గం లో 656 మంది, ఇతర నియోజకవర్గాల నుంచి 1,832మంది మొత్తం 2,488 మంది ఫారం 12 సమర్పించిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌లను పొంద నున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ రానివారు ఈ నెల 28, 29 తేదీల్లో కూడా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తా మన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లు ఇతర నియోజకవ ర్గాల నుంచి ఓట్లు ఇంకా రావాల్సి ఉందని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సరైన విధంగా ఫాం12 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారందరికీ, నవంబర్ 29వరకు కూడా అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలె క్టర్ వెంకటేశ్వర్లు, డీడబ్ల్యూఓ నాగేశ్వరరావు, సీపీఓ సామ్యూల్, డీఎఫ్‌ఓ అవినాష్, డీపీఓ ఆశాలత, ఎం పీడీఓలు ప్రభుత్వ టీచర్లు, ఇతర శాఖల అధికారు లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన

బ్యాలెట్ ఓటింగ్ వినియోగించుకునే ఓటరు జాబితాలో కొంతమంది ఉపాధ్యాయుల పేర్లు లేక పోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. మరి కొంత మంది ఉపాధ్యాయులకు విద్యాశాఖకు బదులుగా పోలీస్‌శాఖగా తప్పుగా వచ్చింది. ములుగు, పర కాల, హనుమకొండ, వరంగల్, మంథని, జగిత్యాల జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగం పై అన్ని నియోజకవర్గాల ఆర్వోలు ముందస్తుగా సమాచారం ఇస్తూ ఓటింగ్ శాతం పెంచేలా కృషి చేస్తున్నారని భూపాలపల్లి నియోజకవర్గంలో మాత్రం భిన్నంగా ఉందన్నారు. మరో రెండు రోజుల్లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటివరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ ఓటరు జాబితా పూర్తి స్థాయిలో సిద్ధం చేయ కపోవడంతో ఎన్నికల అధికారుల నిర్లక్ష్యం కనిపి స్తుంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన కొంతమంది ఉపాధ్యాయుల పేర్లు జాబితాలో లేకపోవడంతో అక్కడ విధులు నిర్వ ర్తిస్తున్న అధికారులతో కాసేపు వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు వారికి సమాధానం ఇస్తూ విధులు నిర్వర్తిస్తున్న నియోజకవర్గాల నుంచి ఇంకా ఓటరు జాబితాలు రావాల్సి ఉన్నాయని వచ్చిన తరువాత సమాచారం ఇస్తామని తెలిపారు.

జంగ్ తెలంగాణ

పూర్వ నక్సలైట్ల సమ్మేళనం

- ములుగు జిల్లాలో పూర్వ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహణ
- 200మందికిపైగా హాజరైన జనశక్తి మాజీ అగ్రనేతలు
- సమకాలీన రాజకీయాలపై చర్చ
- మద్దతు కోరిన సీతక్క.. సరే అన్న మాజీ సహచరులు




మాట్లాడుతున్న సీతక్క, హాజరైన మాజీలు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల వేడి తారస్థాయికి చేరిన వేళ ములుగు జిల్లాలో సీపీఐ(ఎంఎల్) (జనశక్తి) పూర్వ నక్సలైట్ల(మాజీలు) సమ్మేళనం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, హైదరాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్ .. ఇలా తెలంగాణ ప్రాంతంలోని దాదాపు అన్ని జిల్లాల నుంచి 200మందికి పైగా మాజీలు భేటీ అయ్యారు. అప్పటి పార్టీ రాష్ట్ర కార్యదర్శి చార్వాకుడు, మరో అగ్రనేత కూర రాజన్న, కుమారన్న, కృష్ణన్న, సత్తెన్నతోపాటు అనేకమంది నేతలు హాజరయ్యారు. వారితోపాటు అప్పటి పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు, పెద్ద సంఖ్యలో మాజీ దళనాయకులు, సభ్యులతో పాటు జన నాట్యమండలి వారు కూడా ఉన్నారు.

వంటా వార్పుతో కార్యక్రమం

ములుగు జిల్లాలోని ఓ మారుమూల గ్రామం పక్కన టెంట్ వేసి వంటా..వార్పుతో కార్యక్రమం ఉదయం నుంచి సాయత్రం వరకు సాగింది. సమ్మేళనానికి హాజరైన వారంతా చాలా ఏళ్ల కితం జన జీవన స్రవంతిలోకి వచ్చి వివిధ ప్రాంతాల్లో వివిధ వృత్తులు, హోదాల్లో కుటుంబాలతో జీవనం సాగిస్తున్నారు. సమావేశ స్థలానికి చేరేవరకూ ఈ స్థాయిలో ఏర్పాట్లు ఉంటాయని వచ్చేవారికి కూడా తెలియకుండా జాగ్రత్త పడ్డారు. ఒక్కొక్కరి యోగక్షేమాలు, కుటుంబ పరిస్థితులు, పిల్లా పాపల గురించి మాట్లాడుకున్నారు. జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. దండకారణ్యంలోని అప్పటి విషయాలు గుర్తు చేసుకున్నారు. సమకాలీన రాజకీయాలపై చర్చించుకున్నారు. స్థానిక పీడీఎస్‌యూ పూర్వ నాయకత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమ్మేళనానికి ఒకప్పటి జనశక్తి నేత, ప్రస్తుత ములుగు ఎమ్మెల్యే, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సీతక్క కూడా హాజరయ్యారు.

పార్టీ ఏదైనా భావజాలం అదే: సీతక్క

ఈ సందర్భంగా సీతక్క ములుగు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉన్న తనకు పూర్వ సహచరులు సహకరించాలని, గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. ఈ ప్రాంతంలో మీకున్న పాత పరిచయాలు గుర్తు చేసుకుని వారికి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. తాను కాంగ్రెస్‌లో ఉన్నప్పటికీ తన భావజాలం మాత్రం మారలేదన్నారు. తను నడిచే దారిలో నిజాయితీ ఉన్నందున తన గెలుపునకు సహకారం అందించాలని కోరారు. దీంతో ఆమె మాజీ సహచరులు, మాజీ నేతలు సరే అని అన్నట్టు సమాచారం. కాగా, చరిత్రలో తొలిసారి విప్లవ గ్రూపుల మాజీ అగ్రనేతలు పెద్దసంఖ్యలో ఇలా సమావేశం కావడం చర్చకు దారితీసింది.

ప్రచారం.. కొత్త పుంతలు



ఎన్నికల ప్రచార శైలిలో కాలానుగుణ మార్పులు

- సైకిళ్లు, రిక్షాల నుంచి హెలికాప్టర్ వరకు..
- వాల్‌పోస్టర్ రైటింగ్ నుంచి డిజిటల్ స్క్రీన్ వరకు ప్రచారంలో నూతన ఒరవడి..



ప్రచారానికి హెలికాప్టర్‌లో వస్తున్న రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు (ఫైల్)

హన్మకొండ: దేశంలో కాలానికి అనుగుణంగా ఎన్నికల ప్రచారం మారుతోంది. ఒకప్పుడు సైకిళ్లు, రిక్షాల్లో తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. అభ్యర్థులు గ్రామాలు, పట్టణాల్లో ఓటర్లను ప్రభావితం చేయగలిగే ఒకరిద్దరు ప్రముఖులను మాత్రమే కలిసి వెళ్లే వారు. దీంతో వారు ఓటర్లకు పార్టీలు, అభ్యర్థుల గురించి వివరించి ఓట్లు వేయించే వారు. టీడీపీ శ్రేణులు సైకిళ్ల ద్వారా ర్యాలీలు నిర్వహించేవి. అభ్యర్థులు మాత్రం జీపులు, ఓపెన్ జీపుల్లో ప్రచారం చేసేవారు. ప్రస్తుతం ప్రచారం నేల నుంచి ఆకాశయానికి చేరింది. కార్ల నుంచి మొదలు.. హెలికాప్టర్ వరకు జరుగుతోంది. ఫలితంగా ప్రచారం కొత్త పుంతలు తొక్కుతోంది. అలాగే, అభ్యర్థులు, వారి కుటుంబీకులు, బంధువర్గంతో పాటు పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి స్వయంగా ఓటర్లను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

ఉరుకులు, పరుగుల మధ్య ప్రచారం..

పార్టీల అధినేతలు, ప్రముఖుల ప్రచారం ఉరుకులు, పరుగుల మధ్య సాగుతోంది. సమయంతో పోటీ పడి ప్రచారం చేస్తున్నారు. రోజుకు రెండు, మూడు, నాలుగు సభల్లో పాల్గొనాల్సి రావడంతో హెలికాప్టర్‌లను విస్తృతంగా వినియోగిస్తున్నారు. పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కో పార్టీ మూడు నుంచి నాలుగు హెలికాప్టర్లను వినియోగిస్తోంది. ఫలితంగా రిక్షాలు, సైకిళ్ల నుంచి.. హెలికాప్టర్ వరకు.. ప్రచార రూపాల్లో మార్పు సంభవించింది. రిక్షాలు, సైకిళ్ల పై వచ్చి ప్రచారం చేసిన అగ్రనాయకులు అనంతరం జీపులు అందుబాటులోకి రావడంతో వాటిలో తిరుగుతూ ప్రచారం చేశారు. జీపుల అనంతరం కార్లలో ప్రచారం చేశారు. ఇప్పుడు కార్లలోనూ వివిధ శ్రేణులు రావడంతో వాటిని అభ్యర్థులు వినియోగిస్తుండగా అగ్ర నాయకులు హెలికాప్టర్‌లో తిరుగుతున్నారు.



ఆదివారం జనగామలో ప్రచారం రథంపైనుంచి మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి దశమంతరెడ్డి

గోడలపైనే ప్రచారం..

ఒకప్పుడు గోడలపై అభ్యర్థుల పేర్లు, గుర్తులు, పార్టీ వివరాలు రాసి ప్రచారం చేసే వారు. అనంతరం గోడలపై రాయడంతో పాటు పోస్టర్లు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు గోధుమ పిండితో తయారు చేసిన జిగురుతో పోస్టర్లు అంటించే వారు. ఆ తర్వాత స్టిక్కర్ రూపంలో పోస్టర్లు వచ్చాయి. ప్రస్తుతం స్టిక్కర్ల రూపంలో ఉన్న పోస్టర్లు వినియోగంలో ఉన్నాయి. ఎన్నికల కమిషన్ నిర్ణయాలతో గోడలపై రాతలు పూర్తిగా కనుమరుగయ్యాయి. ఒకప్పుడు ఎన్నికలు వచ్చాయంటే గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో గోడలన్నీ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల రాతలతో పాడయ్యేవి. ప్రస్తుతం ఏ రాతలు లేక సుందరంగా కనిపిస్తున్నాయి. పోస్టర్లు అంటించేందుకు కూడా అనుమతి తీసుకోవాలనే నిబంధన ఉండేది. దీంతో ప్రస్తుతం వీటిని అంటించేందుకు సాహసించడం లేదు.

డిజిటల్ స్క్రీన్లతో ప్రచారం..

గోడలపై రాతలు, పోస్టర్లకు కాలం చెల్లడంతో ప్రచార రూపాల్లో కొత్తదారులు పుట్టుకొచ్చాయి. ప్రస్తుతం రథాల ద్వారా విస్తృత ప్రచారం సాగుతోంది. అభ్యర్థులు ప్రచార రథాలను పార్టీల రంగులు, గుర్తులతో ఆకర్షణీయంగా తయారు చేయించి డీజేలు బిగించి ప్రత్యేకంగా రచించి, స్వరపరిచిన పాటలతో ప్రచారం హోరెత్తిస్తున్నారు. దీంతో పాటు డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడంతో వాహనాలపై డిజిటల్ స్క్రీన్‌లు బిగించి రంగుల దృశ్యాలతో ఆకర్షణీయ ప్రకటనలు ప్రదర్శిస్తూ, అగ్ర నాయకుల ప్రసంగాలు వినిపిస్తూ ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు పాట్లు పడుతున్నారు.

నాడు మిత్రులు .. నేడు ప్రత్యర్థులు

- వరంగల్ తూర్పులో విచిత్ర పరిస్థితి
- ఈ నియోజకవర్గంలో ముక్కోణపు పోటీ
- గెలుపు కోసం ఎవరికి వారే తీవ్ర ప్రయత్నం



ప్రదీప్‌రావు సురేఖ నరేందర్

హన్మకొండ: వారంత ఒకప్పుడు ఒకే పార్టీలో ఉంటూ మిత్రులుగా ఉన్నారు. ఒకే అభ్యర్థి కోసం పని చేశారు. ప్రస్తుతం మూడు పార్టీల నుంచి ప్రత్యర్థులుగా పోటీ పడుతున్నారు. వారే కొండా సురేఖ, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, నన్నపునేని నరేందర్. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా కొండా సురేఖ పోటీ చేయగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు, నన్నపునేని నరేందర్ అదే పార్టీలో కొనసాగుతూ ఆమె విజయానికి కృషి చేశారు. అయితే తదనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో వీరు ముగ్గురు మూడు ప్రధాన పార్టీల్లో చేరారు. 2014లో ఒకే పార్టీ విజయానికి కృషి చేసిన ఈ ముగ్గురు.. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీల నుంచి ఇదే నియోజకవర్గం నుంచి పోటీ పడుతున్నారు. కొండా సురేఖ కాంగ్రెస్ అభ్యర్థిగా, ఎర్రబెల్లి ప్రదీప్ రావు బీజేపీ, నన్నపునేని నరేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. దీంతో ఇక్కడ ముక్కోణపు పోటీ నెలకొనడంతో ఎన్నిక రసకందాయంగా మారింది. కొండా సురేఖ 2014లో వరంగల్ తూర్పు నుంచి విజయం సాధించగా, నన్నపునేని నరేందర్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. గతంలో ఇదే నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం పార్టీ, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు ద్వితీయ స్థానంలో నిలిచారు. ముగ్గురు బలమైన అభ్యర్థులు కావడంతో ఇక్కడ పోటీ ఉత్కంఠ కలిగిస్తోంది. గెలుపు కోసం ముగ్గురు ఎవరికి వారు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

నిఘా నీడలో ఓటింగ్..

- పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- ఓటింగ్ సరళిపై నిరంతరం పర్యవేక్షణ
- సీసీ ఫుటేజీల్లో వీడియో చిత్రాలు నిక్షిప్తం




ఖిలా వరంగల్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఈసీ (ఎలక్షన్ కమిషన్) ఆధునిక సాంకేతికను వినియోగిస్తోంది. ఎన్నికల సరళిని నిరంతరం పర్యవేక్షించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పోలింగ్ కేంద్రం, బూత్‌ల్లో ఆన్‌లైన్ విధానాన్ని ఏర్పాటు చేసింది. పోలింగ్‌బూత్‌ల వద్ద సిగ్నల్ సమస్య తలెత్తకుండా ఆన్‌లైన్ వ్యవస్థను పటిష్ట పరిచింది. ఫలితంగా నిఘా నేత్రం కనుసన్నల్లోనే ఉన్నతాధికారులు ఎన్నికల సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు.

ఆన్‌లైన్‌లోనే పోలింగ్ ప్రక్రియ..!

ఎన్నికల్లో ప్రత్యర్థులపై ఆధిపత్యం కొనసాగించేకు కొందరు అభ్యర్థుల వర్గీయులు అల్లర్లు, ఘర్షణలకు పాల్పడుతుంటారు. డబ్బు, మద్యం, ఇతర కానుకలతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉంటుంది. ఒకరికి బదులు మరొకరు దొంగ ఓట్లు వేస్తారు. ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేసేందుకు ఇప్పటికే పోలింగ్ కేంద్రాల్లో అధునాతన సీసీ కెమెరాలు అమర్చారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని మానిటరింగ్ అధికారులు ప్రత్యేక్షంగా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఏదైనా ఘటనలు జరిగితే వీడియో చిత్రాలను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకూ పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లోనే నిక్షిప్తం కానుంది. ఫలితంగా ఎక్కడైనా ఘర్షణలు చోటుచేసుకుంటే స్థానిక పోలీసులతో పాటు బీఎస్ఎఫ్ బలగాలు క్షణాల్లో ఘటనాస్థలికి చేరుకుని అదుపులోకి తేనున్నాయి.

మొత్తం 2,950 పోలింగ్ కేంద్రాలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో మొత్తం 2,950 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో జిల్లాల వారీగా జనగామ 277, స్టేషన్ ఘన్‌పూర్ (స్టేషన్) 290, పాలకుర్తి 290, డోర్నకల్ 256, మహబూబాబాద్ 275, నర్సంపేట 283, వరంగల్ ఈస్ట్ 215, వర్ధన్నపేట 268, పరకాల 238, వరంగల్ పశ్చిమ 241, భూపాలపల్లి 317 ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని ఎన్నికల అధికారులు జీపీఎస్ సిస్టమ్ ద్వారా అనుక్షణంగా వీక్షిస్తూ, అక్కడి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుంటారు.

బుగులోని వెంకన్న జాతర షురూ

- ఘనంగా స్వామివారి కల్యాణం

రేగొండ : కార్తీక పౌర్ణమి సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని తిరుమలగిరి శివారులో ప్రతిఏడాది నిర్వహించే బుగులోని వేంకటేశ్వరస్వామి జాతర ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న బుగులోని వెంకన్నను ప్రత్యేక పల్లకీలో గుట్ట పైకి చేర్చారు.అర్చకులు వెంకటేశ్వర్లు ఇంట్లో కొలువైన స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కల్యాణానికి ప్రత్యేక రథం

ప్రత్యేకంగా అలంకరించిన రథంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను మేళా తాళాలతో, కోలాటాల నడుమ జాతర ప్రాంగణానికి తరలించారు. ఊరేగింపుగా వెళ్తున్న స్వామి వారికి అడుగడుగున మంగళహారతులతో నీరాజనాలు పలికారు. సాయంత్రం గుట్ట కింద ఉన్న శివాలయం ప్రాంగణంలో అలివేలుమంగ, పద్మావతి అమ్మవార్లతో స్వామి వారి వివాహ వేడుకను కనులపండువగా నిర్వహించారు. కల్యాణ తంతును వీక్షించేందుకు రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలతో పాటు ఇతర మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం సతీసమేతంగా స్వామి వారిని కొండ గుహలో వెలసిన ప్రాంతానికి చేర్చారు. స్వామి వారి రాకతో గుట్ట పై ఉన్న గండ దీపాన్ని వెలిగించారు. పచ్చని ప్రకృతి, పౌర్ణమి కాంతులు, విద్యుత్ వెలుగుల నడుమ బుగులోని కొండలు దేదీప్యమానంగా వెలుగుతూ భక్తులను అలరిస్తున్నాయి.



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మద్యపానం నిషేధం



ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బుగులోని జాతరలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, విక్రయించడం నేరం. ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలతో పాటు, ఎలక్షన్ కోడ్ ప్రకారం కేసులు నమోదు చేస్తాం.

– శ్రీకాంత్‌రెడ్డి , ఎస్సై రేగొండ

మోదీతో బీసీలు జోడీ కట్టాలి..

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

నయీంనగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో బీసీలు జోడీ కట్టి తెలంగాణలో బీసీని ముఖ్యమంత్రి చేయడానికి బీజేపీని గెలిపించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ కోరారు. ఈ మేరకు ఆదివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సురేష్ మాట్లాడుతూ బీసీ వ్యక్తి దేశానికి ప్రధానిగా ఉంటూ తెలంగాణ రాష్ట్రానికి బీసీని ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ నేపథ్యంలో బీసీలు రాజ్యాధికారం కోసం ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో ఉద్యోగాలు రాక యువకులు వ్యసనాలకు బానిసలయ్యారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు మారెపల్లి లక్ష్మణ్, బండారు పద్మావతి, శ్రీలత, బలరాం, మడత కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రచార వాహనంపైనుంచి పడి బాలిక మృతి



అంజలి (ఫైల్)

కొడకండ్ల: బీఆర్ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు సంబంధించిన ప్రచార వాహనం పైనుంచి పడి ఓ బాలిక మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని నీలిబండతండాలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం తండాలో శనివారం సాయంత్రం వాహనం ప్రచారం నిర్వహించే క్రమంలో తండాకు చెందిన గుగులోత్ దేవేందర్, లక్ష్మి దంపతుల కూతురు అంజలి(9)తో పాటు మరికొందరు పిల్లలు వాహనం ఎక్కారు. వాహనం వెళ్తున్న క్రమంలో అంజలి కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు, కుటుంబీకులు గమనించి అంజలిని వెంటనే చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. అనంతరం అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించగా ఆదివారం మృతి చెందింది. దీంతో తండాలో విషాదం నెలకొంది. కాగా, అంజలి స్థానిక ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది.

ఆకాశాన్నంటిన 'అఖండ జ్యోతి'

- కనుల పండువగా జ్యోతి ప్రజ్వలన



పాలకుర్తి టౌన్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని క్షీరాద్రి క్షేత్రమైన జనగామ జిల్లా పాలకుర్తిలో పరమ శివుడు అఖండ జ్యోతి రూపంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఆదివారం సాయంత్రం 6.15 గంటలకు శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో క్షీరగిరిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రమిదలో అఖండజ్యోతిని ఉత్తరకాశి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి వెలిగించారు. అంతకు ముందు అఖండ దీపోత్సవంలో భాగంగా ఆలయంలో కలశ స్థాపన, గణపతి పూజ, మండపారాధన నిర్వహించారు. అఖండజ్యోతిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ మహేంద్రకుమార్, ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, అర్చకులు పాల్గొన్నారు.

గోదావరికి హారతి



గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పంచరత్నాల్లో భాగంగా నాల్గోవ రోజు కార్తీకశుద్ధ చతుర్ధశిని పురస్కరించుకొని గోదావరి నదికి పంచహారతి కార్యక్రమాన్ని అర్చకుడు కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. గోదావరి తల్లికి ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, పాలు, పండ్లు, పసుపు, కుంకుమతో పాటు సారెను సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ మహేష్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి, శ్యాంసుందర్ దేవుడా, అర్చకులు ప్రకాంత్‌శర్మ, బైకుంఠపాండా, సుబ్రమణ్యశర్మ, రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- చంపి రైలు ప్రమాదంలా చిత్రీకరిస్తున్నారని బంధువుల ఆందోళన



సిద్దు(ఫైల్)



రాస్తారోకో చేస్తున్న మృతుడి కుటుంబీకులు

మహబూబాబాద్ రూరల్ : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని పాత కురవి గేటు ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కాగా సదరు యువకుడిని కొట్టి హత్య చేసి రైలు ప్రమాదంలో మృతిచెందినట్లు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు రాస్తారోకో చేపట్టి ఆందోళనకు దిగారు. జీఆర్పీ డోర్నకల్ ఎస్సై కె.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండలం చంద్యా తండాకు చెందిన భూక్యా నగేష్, శారద దంపతుల కుమారుడు భూక్యా సిద్దు(19) శనివారం అర్ధరాత్రి మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని పాత కురవి గేటు ప్రాంతంలో రైలు ఢీకొని మృతిచెందాడని తెలిపారు. సమాచారం అందిన వెంటనే తాము సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించి భద్రపరిచామన్నారు. ఆదివారం ఉదయం సిద్దు తండ్రి నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. కాగా మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు మాత్రం సిద్దు మృతిపై అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ చేసి దోషులను గుర్తించి శిక్షించాలని కోరారన్నారు. కుమారుడి మృతికి విష్ణువర్ధన్, శివపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. విచారణ అనంతరం కేసును మహబూబాబాద్ టౌన్ పోలీసులకు అప్పగిస్తామని పేర్కొన్నారు.

బంధువుల రాస్తారోకో

భూక్యా సిద్దు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టు మార్టం చేసేందుకు తీసుకురాగా అతడి బంధువులు, కుటుంబ సభ్యులు సిద్దు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అండర్ బ్రిడ్జి వద్ద రాస్తారోకో చేపట్టి ఆందోళన నిర్వహించారు. తమకు న్యాయం జరిగేంత వరకు ఊరుకోబోమని హెచ్చరిస్తూ సిద్దు మృతదేహాన్ని పోస్టుమార్టం గది నుంచి బయటకు తీసుకువచ్చి రోడ్డుపై పెట్టి నినాదాలు చేశారు. మృతుడి తండ్రి నగేశ్ మాట్లాడుతూ.. తమ కొడుకు సిద్దు హైదరాబాద్‌లో ఆటో నడుపుతున్నట్లు తెలిపారు. తండాలో జరిగిన శుభాకా ర్యానికి హాజరయ్యాక, తండాకే చెందిన కొంద రు యువకులు అతనిని సినిమాకు వెళ్దామని మహబూబాబాద్‌కు తీసుకువచ్చారన్నారు. పథకం ప్రకారం హతమార్చి రైలు ఢీకొని మృతిచెందినట్లు వారే తమకు ఫోన్ చేసి వివరాలు చెప్పినట్లు పేర్కొన్నారు. పోలీసులు విచారణ చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న టౌన్ సీఐ సతీష్, ఎస్సై విజయరాం కుమార్ మృతుడి బంధువులతో మాట్లాడి పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.